కళ్యాణి - ఆది

ఏమని పొగడుదు - మే యిక నిన్ను ను
ఆమని సొబగుల - అలమేల్మంగ

తెలిగన్నుల నీ - తేటలే కదవే
వెలయగ విభునికి - వెన్నెలలు
పులకల మొలకల - పొదులివి గద వే
పలుమరు పూవుల - పానుపులు

తియ్యని నీ మోవి - తేనెలే గదవె
వియ్యపు రమణుని - విందులివి
ముయ్యక మూసిన - మొలక నవ్వు గదె
నెయ్యపు కప్రపు - నెరి బాగాలు

కైవస మగు నీ - కౌగిలే కదవే
శ్రీవేంకటేశ్వరు - సిరి నగరు
తావుకొన్న మీ - తమకములే కదె
గావించిన మీ - కళ్యాణములు

సంతత వసంత శోభల నిత్యయౌవన అలమేల్మంగ. ఆమె ఆమని సొబగులు వర్ణిం పతరమా! అంటూ ఆమెను సంబోధిస్తూ అలమేల్మంగ అందాలకి అద్దం పట్టుతున్నారు అన్నమాచార్యులు.

నీ కన్నుల తేట తెల్లని కాంతులు కదమ్మా విభునికి వెలసిన వెన్నెలలు. నీ మేన ఏర్పడే పులకాంకురపు అక్షయపు తావులే శ్రీవరునకు పూలశయ్యలు. (అలమేల్మంగ సుమకోమలాంగి).

నీ అధరామృతపు తేనెలేగదా ఆ అమృతమదనునకు విందారగింపులు. నీ సిగ్గు నిగ్గుల నెలవి నవ్వులేకదా కప్పురపుమైదూళివానికి కర్పూర తాంబూలముల వక్క పలుకులు.

మీరుభయులూ పరస్పరాశ్రయులు. నీవాయనకు కైవసం. ఆయన నీకు కైవసం. శ్రీవిష్ణు పరిష్వంగ నిత్యవాసినివి నీవు. లక్ష్మీ నివాస హృత్కమలుడాస్వామి. ఆ తిరువేంకటేశ్వరు సిరినగరు ఏది ? నీ కౌగిలేనమ్మా ఆయనకు వైకుంఠం.

నెత్తావులు వెదజల్లే మీ నెమ్మి మీరిరువురకూ నిత్యకళ్యాణమేర్పరచినది. నీవు నవోఢ

ప్రకృతి కాంతవు. ఆ స్వామి పురుషోత్తముడు. మీ యిరువురి కలయికా, ఉద్వాహమూ, జగన్మంగళదాయకము, జగన్మంగళ కారణమూనమ్మా అంటూ అలమేల్మంగా సౌందర్య దర్పణ సంకీర్తనం సాయించారు అన్నమాచార్యులు.